


## నేడు తిక్కన ప్రాంగణంలో జరిగే హైటి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**నెల్లూరు టౌన్, డిసెంబర్ 22, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోని క్రైస్తవ పాస్టర్లు, మత పెద్దలు, సోదరీ సోదరులు అందరికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఆర్థిక సంస్థ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా హైటి కార్యక్రమం ఈనెల 23వ తేదీ శనివారం సాయంత్రం 4గంటలకు నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన భవనంలో జరుగుతుందని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి డాక్టర్ ఏ.నిర్మల దేవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె జిల్లా కేంద్రమైన నెల్లూరులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలోని అందరూ పాస్టర్లు, క్రైస్తవ మతపెద్దలు క్రైస్తవ సోదరి సోదరులందరూ, జిల్లా అధికారులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తప్పక హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించండి



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త – వైద్యం** రానున్న రెండు నెలలు ఎంతో కీలకమని, ఈ సమయంలో వైసీపీ వైఫల్యాలను పూర్తి స్థాయిలో ప్రజలకు వివరించాలని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నారాయణ మెడికల్ కాలేజీలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి నారాయణ 28 డివిజన్లకు సంబంధించిన అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఆయన బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమ పురోగతిపై చర్చించారు. పలు కీలక అంశాలతో టీడీపీ శ్రేణులకు నారాయణ దిశానిర్ధేశం చేశారు. మన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వైసీపీ వైఫల్యాలు, అరాచకాలను తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రానున్న రెండు నెలలు ఎంతో కీలకమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేస్తే 2024లో విజయం ఖాయమని తెలిపారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. అదే విధంగా అధికారంలోకి వచ్చిన వైసీపీ నెల్లూరు నగరాభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. అనంతరం నెల్లూరు పార్లమెంటు జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబునాయుడు, మంత్రిగా పొంగూరు నారాయణ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఇందు కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ ముప్పాళ్ల విజేతరెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### జగన్ అరాచక పాలనకు స్వస్తి పలకాలి

జగన్ పరిపాలన అరాచకంగా ఉందని ఎన్నికల్లో ఆ పరిపాలనకు స్వస్తి చెప్పేలా టీడీపీకి ఓట్లు వేసి తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని 6వ డివిజన్‌లోని స్టోన్ హౌస్‌పేటలో తదితర ప్రాంతాల్లో బాబు షూరిటీ– భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి, నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొంగూరు నారాయణ పాల్గొన్నారు. అనంతరం డివిజన్‌లోని ప్రతి షాపుకు వెళ్లి బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేస్తూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వివరించారు. పొంగూరు మాట్లాడుతూ నెల్లూరులో ప్రశాంత వాతావరణం కావాలంటే మళ్లీ టీడీపీ రావాలని ప్రజలే కోరుకుంటున్నారన్నారు. వ్యాపారాలు భాగా జరిగితేనే రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని, చంద్రబాబునాయుడు ఎకనమిక్ ప్లాన్ అన్నారు. అలాంటి మంచి ఆలోచన వైసీపీ ప్రభుత్వానికి రావని ఎద్దేవ చేశారు. యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళాన్ని అడ్డుకోవాలని వైసీపీ ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు, ప్రయత్నాలు చేసిందన్నారు. అవన్నీ లెక్క చేయకుండా లోకేష్‌బాబు యువగళాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. యువగళం ముగింపు సభకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, 6వ డివిజన్ అధ్యక్షులు కొండ ప్రవీణ్, ఇన్‌ఛార్జి గుత్తా అన్నపూర్ణ, జనరల్ సెక్రటరీ సాయికుమార్, యూనిట్ ఇన్‌ఛార్జిలు గుత్తా నరహరి, రామకృష్ణ, బూత్ కన్వీనర్ విజయలక్ష్మి, మల్లిక, రవి, రాజ్యలక్ష్మి, బీఎల్‌ఏ విజయ దుర్గ, కవిత, దుర్గ, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల కొరత తీర్చమని తల్లిదండ్రుల ఆందోళన

**ఉదయగిరి, డిసెంబర్22, ప్రభాతవార్త** ఉదయగిరి మండలం బిజ్జంపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని వెంటనే తీర్చాలని గ్రామస్తులు,విద్యార్థులు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 31మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారని వారికి భౌతికశాస్త్రం,ఆంగ్లం, సోషల్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో ఎన్నోసార్లు మండస్థాయి అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.తాత్కాలికంగా ఇటీవల ప్రాథమిక పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులను ఇన్‌చార్జిలుగా వేయడం వల్ల 10వ తరగతి విద్యార్థులకు సబ్జెక్టు పై అంతగా పట్టులేకుండా పోయిందన్నారు.పరిస్థితి ఈ విధంగా ఉంటే మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో 10వ తరగతి విద్యార్థులు ఫెయిల్ అయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తపరిచారు. ఈ విషయమై ఎమ్ఈవోను తల్లిదండ్రులు సంప్రదించాలని ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదని తెలిపారు.

## చంద్రబాబు ఆదేశాలే మాకు శిరోధార్యం



**కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలే తమకు శిరోధార్యమని కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన అన్న రవీంద్రనాయుడులు తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని చంద్రబాబు నివాసంలో మాలేపాటి సోదరులు చంద్రబాబుని కలిశారు. రానున్న ఎన్నికలలో కావలి టిడిపి టికెట్ కోసం మాలేపాటి సుబ్బానాయుడు తీవ్ర స్థాయిలో ప్రయత్నం చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడారు. చంద్రబాబు మా బాబు అని తెలిపారు. రాజకీయాలలో చంద్రబాబు ఎంత చెబితే మాలేపాటి సోదరులు ఆయన బాటలో పయనిస్తారన్నారు. టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా తెలుగుదేశం పార్టీని వీడేది లేదన్నారు. కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్‌గా రెండు సంవత్సరాల పాటు పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డామని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం క్యాడర్ భయపడుతూ బయటకు రాలేని తరుణంలో తనను టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చంద్రబాబు నియమించారన్నారు. కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చామన్నారు. కార్యకర్తలకు మనోధైర్యం కల్పించామన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేస్తామని మాలేపాటి ధీమాను వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో చంద్రబాబు ఎలా చెబితే అలా నడుచుకుంటామని తెలిపారు.

## కోవూరు కలుజు దగ్గర 2.45 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి



**కోవూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త** కోవూరు లోని కలుజు ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధులు 2 .45 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు.కోవూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతు గతంలో ఈ కలుజు ప్రాంతంలో బ్రిడ్జి ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్యను కూడా తీసుకొని వెళ్లి పరిశీలించడం జరిగిందని అన్నారు. ఈనేపద్యంలో ఈ ప్రాంతంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ దృష్టికితీసుకొని వెళ్లగాఇందుకు ఆయన స్పందించి డిఆర్ఎంఎఫ్ నిధుల నుండి 2 .45 కోట్లు నిధులు మంజూరుచేశారని ఇందుకు జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. దీనికి సంబందించిన మంజూరు పత్రాన్ని ఎంపిపి టి .పార్వేతీ, జడ్‌పిటిసి శ్రీలతకు అందజేయడం జరిగిందని అన్నారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరజంన్‌బాబురెడ్డి,కోవూరు ఎఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి,తదితరులున్నారు.

## ఆదరణ కేంద్రంలో బిర్యానీ, బుక్స్,స్టేషనరీ పంపిణీ

**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరులోని ఆదరణ కేంద్రంలో వుంటున్న నిర్భాగ్యులై ఆదరణ కోల్పోయిన వారికి మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు దిలీప్‌కుమార్ రాయపాటి ఆధ్వర్యంలో చికెన్ బిర్యాని, విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు.ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడారు. దుబాయ్‌లోని ప్రముఖ వ్యాపార దిగ్గజమైన కండే వెంకటేశ్వర్లు యాదవ్‌కు నైజీరియా దేశ విశిష్ట అవార్డు హానరీ చీఫ్ వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కండే వెంకటేశ్వర్లు యాదవ్ తన వ్యాపార ఉత్పత్తులను నైజీరియా దేశానికి అందించడం వల్ల తద్వారా తమ దేశ ఆర్థిక పరిపుష్టికి దోహదపడినందుకు నైజీరియా రాజు చేతుల మీదుగా ఆ దేశ ఉన్నత స్థాయి అవార్డు హానరీ చీఫ్‌ను అందుకోవడం కావలి ప్రాంతానికి గర్వకారణమన్నారు ఈ కార్యక్రమంలో కండే ప్రాణమిత్రులు వై.దాసు, ఎం.నరేష్, పి.మార్టిన్, కె.ఏసురత్నం, ఎం.మల్లికార్జున్, జి.కిషోర్, జి.దివాకర్, మీ కోసం సేవా సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు ఆవులమంద, బ్రైంటు హెల్ప్ అధ్యక్షులు నందిపాటి రమేష్, గుడ్‌మెన్ ట్రస్ట్ అధ్యక్షులు సోమిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొండబిట్రగుంటలో ముక్కోటి ఏకాదశి

**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ స్వామి వారికి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, కార్యనిర్వాహణాధికారి అరవ రాధాకృష్ణలు తెలిపారు. వేకువజామున 2.30 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలతో భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకునేందుకు ఉదయం 4.30 గంటల నుండి పది గంటల వరకు అందుబాటులో వుంటుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్న అన్నదానం, రాత్రికి సహస్ర దీపాలంకరణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# కావలిలో కత్తులతో స్వైర విహారం.. ఒకరు మృతి





**కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త** కావలిలో కనీవినీ ఎరుగని రీతిలో కత్తులతో కొంతమంది స్వైర విహారం సృష్టించిన దారుణ సంఘటన శుక్రవారం జరిగింది. ఈ సంఘటన కావలిని వణికిస్తోంది. ఈ సంఘటనలో సూరిశెట్టి సురేష్(50) మృతి చెందారు. మరో నలుగురు సుష్మ, నాగిశెట్టి శ్రీనివాసులు, నాగిశెట్టి ప్రశాంత్, మామిడాల సుధాకర్‌లు కత్తుల దాడిలో తీవ్ర గాయాలయ్యాయి. ఈ దారుణ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలావున్నాయి.

కావలి మున్సిపాల్టీ పరిధిలోని ముసునూరు ఆటోనగర్‌లో నివసిస్తున్న సూరిశెట్టి నివాసానికి కావలి 34వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్ పుల్లా శ్రీనివాసులరెడ్డి సోదరుడు పుల్లా సుబ్బారెడ్డి, చలంచర్ల విజయ్‌రెడ్డిలు కొంతమందితో వెళ్లారు. సూరిశెట్టి సురేష్‌కు, పుల్లా సుబ్బారెడ్డిల మధ్య ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు వున్నట్లు పోలీసులు చెప్పడాన్ని బట్టి తెలుస్తుంది. ఈ ఆర్థిక లావాదేవీలపై చర్చలు జరుగుతున్న సమయంలో పుల్లా సుబ్బారెడ్డితో వచ్చిన చలంచర్ల విజయ్‌రెడ్డి వున్న పళంగా కత్తితో సురేష్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దాడిని అడ్డుకునేందుకు వచ్చిన సురిశెట్టి సురేష్ కుమార్తె సుష్మపై కత్తితో దాడి చేశాడు. సురేష్ నివాసంలో అద్దెకుంటున్న నాగిశెట్టి శ్రీనివాసులు, ఆయన కుమారుడు ప్రశాంత్, ఆయన బావ మామిడాల సుధాకర్‌లు అడ్డుపోయారు. వారిని కూడా కత్తితో దాడి చేశాడు. ఈ కత్తి దాడిలో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. కత్తి దాడిలో గాయపడ్డ నలుగురిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులతో, బంధువులతో కావలి ఏరియా వైద్యశాల కిక్కిరిసిపోయింది. మృతుడు సూరిశెట్టి సురేష్ భార్య వాణి రోదనలతో ఆ ప్రాంతం విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల కన్నీటి రోదనలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. సంఘటన ప్రదేశాన్ని కావలి డిఎస్పీ వెంకట రమణ, వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావు, రూరల్ సిఐ రాజేష్, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. ఈ సంఘటన జరిగిన సమయంలో ముసునూరులోనే కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు కూడా వున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముసునూరు ఆటోనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరుకై ఏర్పాటు



**నెల్లూరుఅర్బన్, డిసెంబర్22, ప్రభాతవార్త** జిల్లాలోఅర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరుకై మండల కేంద్రాల్లో తగు ప్రభుత్వ స్థలాలు గుర్తించాల్సిందిగా తహశీల్దార్లను జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఆదేశించారు.శుక్రవారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరుకై ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటి తొలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరుకు అవసరమైన స్థలాలను గుర్తిస్తామన్నారు.జనవరి 6వరకు దరఖాస్తు చేసుకునేందుకు సమయమున్నందుకు,తదుపరి ఆయా దరఖాస్తులను పరిశీలించి అర్హతల మేరకు నిర్ణయిస్తామన్నారు. 5సంవత్సరాల అక్రిడేషన్ సర్వీస్ కలిగిన వారిని కమీషనర్,సమాచార పౌర సంబంధాల శాఖ,విజయవాడవారు గుర్తించి పంపిన ప్రాథమిక జాబితాను రెవెన్యూశాఖ పరిశీలిస్తుందని,అనంతరం తుదిజాబితా మేరకు ఇంటి స్థలాలివ్వడం జరుగుతుందన్నారు.ఈ సమావేశానికి కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు,సిహెచ్ మస్తాన్‌రెడ్డి,సిహెచ్ మురళి,ఆర్‌డిఓ మలోల,కమిటీ కన్వీనర్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.సదారావు హాజరైయ్యారు.

# ప్రిలిమినరీ పరీక్షల శిక్షణ ఇచ్చేందుకు అధ్యాపకులు దరఖాస్తు చేసుకోండి



**నెల్లూరు టౌన్, డిసెంబర్ 22, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, నెల్లూరు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఏపీపీఎస్సీ గ్రూపు–2 రిక్రూట్ మెంట్ ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన అధ్యాపకులు ఈనెల 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి, బీసీ స్టడీ సర్కిల్ నెల్లూరు జిల్లా సంచాలకులు వై.వెంకటయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏమైనా జిల్లా కేంద్రమైన తన కార్యాలయంలో మాట్లాడుతూ పరీక్షలకు హాజరై అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుండి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని అందువలన ఎన్నికైన అధ్యాపకులు తప్పనిసరిగా 27వ తేదీ నుంచి స్టడీ సర్కిల్‌ల్లో అభ్యర్థులకు శిక్షణ ప్రారంభించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన ఒకటిన్నర గంట కాల వ్యవధి కలిగిన పేరేడుకు వెయ్యి రూపాయలు పంపుతా గౌరవ వేతనం చెల్లించడం జరుగుతంఉదని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తులు చేసుకుని అధ్యాపకులు అనుభవం తగిన విద్యార్హత కలిగిన ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా జతపరిచి ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తన కార్యాలయంలో అందజేయాలని, ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవడం జరగదని ఆయన అన్నారు. మొత్తం ఐదు పాఠ్యాంశాలలో బోధన చేసేందుకు ఐదు మంది అధ్యాపకులు శిక్షణ ఇచ్చేందుకు అవసరం ఉందన్నారు. శనివారం నుంచే అధ్యాపకుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చుటకు బీసీ స్టడీ సర్కిల్ నందు నెల్లూరు జిల్లాకు చెందిన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించారు. గ్రూపు–2కి 80 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చుటకు గాను ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ఈశిక్షణ కొరకు పోస్టుగ్రాడ్యూయేట్, కాంపిటీషన్ ఓరియెంటెడ్ విధానంలో గ్రూపు–2కు బోధనా అనుభవం కలిగిన అధ్యాపకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన అధ్యాపకుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన అధ్యాపకులు తమ అనుభవ ధృవీకరణ పత్రంతో పాటు తమ బయోడేటాను సంచాలకులు బీసీ స్టడీ సర్కిల్, పాత ఈ సేవ బిల్డింగ్, ఆర్‌టీసీ వెనుకాల శోధన్ నగర్, నెల్లూరు వారి కార్యాలయంలో ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇతర వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ ఫోన్ నెంబర్లకు 9381554779, 9390239588కు సంప్రదించి తగిన సమాచారం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

# ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ వికాస్ మర్మత్



**నెల్లూరు, డిసెంబరు22 ప్రభాతవార్త–విద్య** ఈనెల 26నుండి నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల నిర వ్వహణ ఏర్పాట్లను కార్పోరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ పరిశీలించారు. శుక్రవారం ఏసీ స్టేడిఎంకు చేరుకున్న ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణస్థాయినుండి క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందన్నారు. ఈనెల 26నుండి జరుగనున్న పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను, క్రీడా శిక్షకులకు, పోటీలు వీక్షించేందుకు విచ్చేసే వారికి ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్నీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇండోర్,అవుట్‌డోర్ క్రీడల నిర్వహణకు అవసరమైన క్రీడా పరికరాలు కొనుగోలు చేయ్యాలన్నారు.క్రీడా మైదానాల్లో అవసరమైనపరికరాలు, మైదానాల్లో ఏర్పాట్లు, వసతులు, ఆహార ఏర్పాట్లు, రవాణా , తాగునీరు, పారిశుధ్యం అన్నీ పటిష్టంగా అమలు చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్, సీనియర్ అధికారి విజయ్, నగరపాలక సంస్థ అధికారులు శర్మద, ఎస్ఈ సంపత్ కుమార్, వెంకటరమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టిస్తున్న రెడ్‌క్రాస్



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త– వైద్యం** తలసేమియా వ్యాధి భారిన పడ్డ చిన్నారులకు పునర్జన్మను ఇస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ చరిత్రను సృష్టిస్తోందని ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ సమావేశ మందిరంలో చంద్రశేఖర్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతెడ్డి మాట్లాడుతూ తలసేమియా అన్నది జన్య సంబంధిత ప్రాణాంతకమైన వ్యాధి అని, ఈ వ్యాధి కొంత మంది చిన్నారుల్లో పుట్టుకతోనే ప్రారంభం అవుతుందని తెలిపారు.

ఈ వ్యాధి భారిన పడిన చిన్నారులకు ప్రతి నెల రక్తం మార్పిడి చేయడం యొక్కటే దీనికి పరిష్కారం అని అన్నారు. నెల్లూరు రెడ్ క్రాస్‌లో గత నాలుగు సంవత్సరాలుగా 110 మంది తలసేమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు ప్రతి నెల ఉచితంగా రక్త మార్పిడి చేస్తూ అందుకు అవసరమయ్యే మందులు ఉచితంగా అందజేసి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తూ చిన్నారులందరిని రెడ్‌క్రాస్ కాపాడుకుంటూ వస్తుందని వివరించారు. అయితే ఈ తలసేమియా వ్యాధిని పూర్తిగా నయం చేయడానికి బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స ఒకటే మార్గమని, అయితే దీనికి ఒక్కొక్కరికి రూ.35 లక్షలు ఖర్చు అవుతుందని అన్నారు. ఇది వ్యయ ప్రయాసలతో కూడిన చికిత్స అని అన్నారు.

దీనికి సంబంధించి నెల్లూరు రెడ్ క్రాస్ గత సంవత్సరం హెచ్ఎల్ఏ పరీక్షలు నిర్వహించి అర్హులైన ఆసక్తి చూపించిన చిన్నారులకు బెంగుళూరు, చెన్నై వంటి మహానగరాల్లో రేలా హాస్పిటల్, చెన్నై అపోలో హాస్పిటల్ సంకల్ప్ ఫౌండేషన్ వారి హాస్పిటల్‌తో మాట్లాడి దాతలు శ్రేయోభిలాషుల సహకారంతో 6 మంది తలసేమియా చిన్నారులకు సుమారు రెండు కోట్ల రూపాయలు ఖర్చు అయ్యే బోన్ మ్యారోట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్సను విజయవంతంగా పూర్తి చేయించామని ఆయన వెల్లడించారు. మరో ఇద్దరు చిన్నారులు శస్త్ర చికిత్స పూర్తి చేసుకుని క్వారంటైన్‌లో ఉన్నారన్నారు. వారందరికి నెల్లూరు రెడ్ క్రాస్ మరో జన్మ ఇవ్వడం జరుగుతోందన్నారు. దీనికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలుతెలిపారు. అనంతరం కన్వీనర్ డాక్టర్ సీత మాట్లాడుతూ 120 మంది చిన్నారులకు ఉచితంగా బ్లడ్ మార్పిడి, మందులు, ఉచితంగా భోజనాలను రెగ్యులర్‌గా రెడ్ క్రాస్ అందజేస్తుందన్నారు. గత సంవత్సరం కూడా రెడ్ క్రాస్ నందు హెచ్ఎల్ఏ టెస్టును నిర్వహించామని, 22న సుమారు 350 మంది రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ నందు నమోదు చేస్తున్నారని వారికి కూడా హెచ్ఎల్ఏ టెస్టు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో డాక్టర్ హరిత, పర్వీన్, వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు, కోశాధికారి సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, మలిరెడ్డి కోటారెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, చామరి జనార్ధన్‌రాజు, వాకాటి విజయకుమార్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, తలసేమియా అడ్వైజర్ డాక్టర్ హరిత, కన్వీనర్ డాక్టర్ సీత, రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, కన్వీనర్ ఎండీ జుబేర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ, కోకన్వీనర్ షేక్ పర్వీన్, తలసేమియా సబ్ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతి పాఠశాలలో గణిత దినోత్సవ వేడుకలు



**పొదలకూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త** పట్టణంలోని అమరావతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ 136 వ జన్మదినోత్సవం పురస్కరించుకొని వేడుకగా పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణంలోరామానుజన్ చిత్రపటానికి ఏర్పాటు చేసి పూలమాలలు వేసి కరస్పాండెంట్ సతీమణి కె .మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు అందరు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కష్టపడితే ఏదైనా సాధించ వచ్చునని విద్యార్థులకు సూచించారు. ప్రదర్శించిన నమూనాలు అందర్ని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన క్విజ్ ప్రతిభా పరీక్ష, అలాగే నమూనాల విభాగంలో ప్రథమ,ద్వితీయ స్దానాలు సాధించిన విద్యార్దులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులకు సన్మానం చేసి జ్ఞాపకలు అందజేశారు.

## నేటి తరానికి ఆదర్శం శ్రీనివాసరామానుజన్



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త** నారాయణపురం (దక్షణమిట్ట ) పాఠశాలలో శుక్రవారం డాక్టర్ చీదరాల చెన్నయ్య ఆద్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. గణితశాస్త్రంలో ఎనలేని ప్రజ్ఞచూపిన శ్రీనివాసరామానుజన్ జయంతిని జాతీయ దణిత దినోత్సవంగా దేశమంతటా పాటిస్తారని ఆయన తెలిపారు. శ్రీనివాస రామానుజన్ 125 వ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న భారతప్రధాని2012 డిసెంబర్22 నుండి ఈ దినోత్సవం జరపాలని ప్రకటించారని అప్పటినుండి జాతీయ గణిత దినోత్సవం నిర్వ హిస్తున్నారని ఆయన తెలిపారు. శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబర్ 22 న తమిళనాడు లో జన్మిం చారు. ఈయన చిన్నవయస్సులోనే గణితశాస్త్రంలో ఎన్నో సిద్దాంతాలను తయారు చేశారు. చిన్నతనంలోనే ఎన్నో సిద్దాంతాలను తయారు చేసినట్లు వివరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పినాకినియూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అద్యక్షులు కె .మురళీ మోహన్‌రాజు, స్వచ్ఛందసేవల గౌరవ అద్యక్షులు ముదిగొండ వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్దులు తయారు చేసిన గణిత నమూనాలను పరిశీలించి వారి గణిత మేదస్సును అభినందించారు. ఉపాధ్యాయురాలు టి . కల్పన,యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ మార్గదర్శకుడు



**కావలి రూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త** నేటి తరం విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ మార్గదర్శకుడని డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు తెలిపారు. కావలి డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం భారతదేశ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్‌నాయుడు మాట్లాడుతూ శ్రీ శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన కృషికి ఆయన స్మారక తపాల బిళ్ళను భారత ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఆయన జన్మదినమైన డిసెంబరు 22వ తేది జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన విశేష కృషిని కొనియాడారు. గణిత శాస్త్రంలో నూతన ఫలితాలను కనుగొన్ని భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి జి.రమేష్‌బాబు, అన్ని విభాగాలధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రిస్‌మస్ కు చర్చిలు ముస్తాబు

**మనుబోలు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** ఈ నెల 25 వ తేది క్రిస్టమస్ పండుగను జరుపుకునేందుకు అటు చర్చిలు,ఇటు క్రైస్తవ కుటుంబాలు సర్వం సిద్దం చేసుకుంటున్నారు. సోమవారం నాడు క్రిస్‌మస్ పండుగ వస్తుంది. ప్రతి ఏటా క్రైస్తవులు తమ దైవం ఏసుప్రభువు పుట్టిన రోజున భక్తి శ్రద్దలతో ,ఆనందంగా జరుపుకుంటారు. ఇందులో భాగంగా క్రైస్తవులకు అతీ ముఖ్యమైన పండుగా కావడంతో చర్చిలు సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే క్రైస్తవ కుటుంబాలు పండుగకు కావాల్సి న అన్ని వస్తువులను కొనుగోలు చేసేశారు. ఇళ్ళపై స్టార్ లు,ఇంటిలో క్రిస్‌మస్ ట్రీలు ,విద్యుత్ దీపాల అలంకరణలతో పండుగ కళ కనిపిస్తుంది. మండల కేంద్రమైన మనుబోలు లోని అంబేద్కర్‌నగర్ లో ప్రార్దన మందిరంలో పాస్టర్ పీటర్‌పాల్ ఆద్వర్యంలో చర్చీ క్రిస్‌మస్‌కు ముస్తాబు అయ్యింది. కొదండరామాపురంలోని సీయోను ప్రార్ధన మందిరం,పిడూరులో మనోహర్ పాల్,కాగితాలపూరులో అల్లూరు మధు,వెంకన్నపాలెం పల్లం శేషయ్య,కొమ్మలపూడిలో మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్‌మస్ పండుగా ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సౌత్ ఆంధ్రా లోత్రాన్ చర్చి సెంట్రల్ ప్యారిస్ రెవరెండ్ పాస్టర్ కూరపాటి స్టాన్లీ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక కార్యాక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

## చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యం



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ప్రత్యేక దృష్టి సారించి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రవేశపెట్టడం జరిగిందని కోవూరు ఎమ్మెల్యే ప్రస న్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రీ ఆడుదాం ఆంధ్ర పోటీలను మస్కట్ ప్రారంభించి లాంఛనంగా వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఈ పోటీలకు గానూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వంద కోట్లు వ్యయం చేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి పోటీల వలన గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీయడమే కాకుండా ఉన్నత శిఖరాలు కూడ అధిరోహించవచ్చన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి, జీఎం ఇండ్రస్టీస్ సుధాకర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, , కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి రజిత్‌కుమా ర్‌రెడ్డి, డీఎల్‌డీపీ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ సుబ్బారెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్ ,జిల్లా వైసీపీ యువజన విభాగం కార్యదర్శి సాయియశ్వంత్‌రెడ్డి. జగదీష్, , ఉపసర్పంచ్ అహ్మద్, వైసీపీ నేతలు కె. మల్లికార్జున్, ఎం. చిరంజీవి, జెబేర్ బాషా, శివకుమార్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణయ్య,, ఉన్నారు.

## నేడు కాంచెరువులో గడప గడపకు మన ప్రభుత్వం

**వరికుంటపాడు, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రములో భాగంగా శనివారం మండలంలోని కాంచెరువు సచివాలయం పరిధిలో కార్యక్రమము జరుగుతుందని మండల పార్టీ కన్వీనర్ మండలపు తిరుపతినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైకాపా ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని,గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు,ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమము సాయంత్రం మూడు గంటలకు ప్రారంభం అవుతుందని కాబట్టి మండలంలోని వైసిపి నేతలు,కార్యకర్తలు,సచివాలయ కన్వీనర్లు తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మండల పార్టీ కన్వీనర్ మండలపు తిరుపతి నాయుడు కోరారు.

## శ్రీనివాసరామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



**కలువాయి డిసెంబర్ 22 ప్రభాతవార్త** భారతీయ గణితమేధావి శ్రీనివాసరామానుజన్‌ను ప్రతి విద్యార్ధి ఆదర్శంగా తీసుకోవాలని చీపినాపి జడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ .జనార్దన్‌రెడ్డి అన్నారు. శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాల నందు శుక్రవారం వేడుకలను జనార్దన్‌రెడ్డి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్దులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతు గణితమేధావి రామానుజన్ జయంతి సందర్భంగా ఈరోజునే జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని అన్నారు. గణితంలో మేధావిగా పేరు పొందిన శ్రీనివాసరామానుజన్‌ను ఆయన జీవితం పట్ల ప్రతి విద్యార్ధి ఆదర్శంగా తీసుకొని గణితంలో ప్రతిభను చూపించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్దులకు వ్యాసరచన ,వకృత్వం,క్విజ్ పోటీలు నిర్వహించి ప్రోత్సహక బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో వి .నారాయణరావు, కోటేశ్వరరావు, మోహన్, శ్రీనివాసరాజుపాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన మోడీ ప్రభుత్వం



జలదంకి, డిశంబర్22, ప్రభాతవార్త :కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేసిందని వామపక్షనే తలుదుయ్యబట్టారు. స్తానిక సురే చెంచురెడ్డి భవన్‌లో శుక్రవారం సి.పి.ఎం సీనియర్ నాయకులు తాళ్ళూరి మాల్యాద్రి,సి.పి.ఐ జిల్లా నాయకుడు దమ్ము దర్గాబాబు,ఎం ఆంతోనిబాబులు విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మోడీ చర్యలను ఖండించారు. ఎన్నడులేని విదంగ లోక్‌సభ,రాజ్యసభలో146 మంది ఎంపిలను సస్పెండ్ చేయడం సరైన చర్యకాదని అన్నారు. ఈఅప్రజాస్వామిక విధానంపై రాష్ట్రంలోని వైసిపి,టిడిపి,జనసేన నేతలు నోరుమెదపకపోవడాన్ని వారు తప్పుబట్టారు. ఆపార్టీలు బిజెపితో అంటకాగుతుందని ఉదహరించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులకోసం పోరాడుతున్న తెలుగుదేశం పార్టీ పెద్దలసభలలో మోడి నిరంకుశ వైఖరిని ఎండగట్టక పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈవిదానాన్ని ప్రజలందరు వ్యతి రేకించాలని వారు పిలుపునిచ్చారు.

## అయ్యప్ప భక్తులకు బిక్ష ఏర్పాటుచేసిన పులిగుంట



**జలదంకి, డిశంబర్ 22, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన జలదంకిలో అయ్యప్ప భక్తులకు శుక్రవారం పులిగుంట మహేంద్రరెడ్డిస్వామి బిక్ష ఏర్పాటుచేసి తన భక్తిభావాన్ని చాటుకున్నారు. తన కుమార్తె లక్ష్మీరోషిణి జన్మదినం సందర్భంగ మహేంద్రరెడ్డిస్వామి కుటుంబం స్వాముల సేవలో తరించారు. ఈసందర్భంగ స్తానిక జానకీరా మలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. గోత్ర నామాలతో ఆలయ అర్చకస్వామి కుందుర్తి సతీష్‌శర్మ అభిషేకాలు చేసి తీర్దప్రసాదాలు అందజేశారు. అనంతరం రామాలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలోటి.డి.పి మండలాద్యక్షుడు పులిగుంట మదుమోహన్‌రెడ్డి దంపతులు తదితరులు పాల్గొనగ గురుస్వాములు లక్ష్మీరోషిణికి తమ దీవెనలు అంద జేశారు.

## లుంబినీ స్కూల్‌లో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



**చేజర్ల డిసెంబర్ 22 ప్రభాతవార్త** చేజర్ల మండలంలోని బోడిపాడు గ్రామ సమీపంలో ఉన్న లుంబినీ ప్రవేటు స్కూల్ నందు శ్రీనివాస రామానుజన్ 136 జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాప్రదర్శన ఎంతగానో ఆకట్టు కుది. అలాగే శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. శ్రీనివాస రామా నుజన్ గణితం కోసం చేసిన కృషిని వారు విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాం డెట్ డి.రమేష్,ఉపాధ్యాయులు,ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



**అనుమసముద్రంపేట ,డిసెంబర్22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్లో గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాసరామానుజన్ పుట్టిన రోజు సందర్భంగా ఇండియన్ మ్యాథ్‌మెటిక్స్ దే వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ సి.హెచ్.రమణారెడ్డి , ప్రధానోపాధ్యాయులు కె.దొరసానిరెడ్డిలు తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పాఠశాలలో గణితంలో విద్యార్థులు రంగవల్లులు వేశారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను పొందిన విద్యార్థులకు మెమొంటోలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ సేవలను రచనలను నిరూపణలను గురించి విద్యార్థులకు తెలియజేసి వివరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీసాయి మహావిద్యాలయలో ఘనంగా మ్యాథ్స్ ఎగ్జిబిషన్



నెల్లూరు, డిసెంబరు22 ప్రభాతవార్త– విద్య నగరంలోని స్థానిక వేదాయపాలెం సెంటర్‌లోని శ్రీ సాయి మహావిద్యాలయ ఇంగ్లీషుమీడియం పాఠశాలలో శుక్రవారం మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు. 6 నుండి 10వ తరగతి విద్యార్థులు నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌లో ముఖ్యఅతిధిగా నెల్లూరు రూరల్ మండల విద్యాశాఖ అధికారి కె.తిరుపాలు పాల్గొని మాట్లాడారు. మా థ్స్‌లో చురుకుగా ఉండే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ టి.నారాయణ మాట్లాడుతు ప్రముఖ ఘణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా డిసెంబరు 22ను మ్యాథ్స్‌డేగా నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆయనకు నివాళులు అర్పిస్తూ నేడు తమ పాఠశాలలో మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశామన్నారు. తమ పాఠశాలలో అకడమిక్ మ్యాథ్స్‌తోపాటూ ఐఐటి మ్యాథ్స్‌కూడా బోధించటం జరుగుతుందన్నారు. అలాగే విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు క్విజ్‌పోటీలు సెమినార్స్‌వంటిని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి ఎంఈఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 1నుండి 3వేల రూపాయలు పెన్షన్



ఉదయగిరి, డిసెంబర్22, ప్రభాతవార్త ఉదయగిరి మండంలోని వైసీపీ కార్యాయ లంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్సి ఎస్‌దాని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద అవ్వ,తాతల మోహాల్లో ఆనందం కోసం జనవరి 1నుండి వైయస్సార్ పెన్షన్‌ను మూడువేల రూపాయలకు పెంచినందుకు రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు. జీవో నెం-96 ద్వారా వృద్దులకు,వితంతువులకు,ఒంటరి మహిళలకు,చేనేత,గీత కార్మికులకు,మత్స్య కారులకు, చర్మకారుల కు,ప్రతినెలా ఇచ్చేపెన్షన్ మూడు వేల రూపాయలకు పెంచినందుకు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారిన తెలిపారు. ఎవరు ఎన్ని విష ప్రచారాలు చేసినా రాబోయే 2024లో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బసగానుపల్లి మాజీ సర్పంచ్ అక్కుల్‌రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్ధికి సైకిల్ అందజేసిన రెడ్‌క్రాస్



కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థి గంగినపల్లి వెంకట లోకేష్‌కుమార్‌కు కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ నందనవనం సీతాలక్ష్మి సైకిల్‌ని వితరణ చేశారు. శుక్రవారం రెడ్‌క్రాస్ భవనంలో ఈ విద్యార్ధికి సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడుతూ మాజీ కౌన్సిలర్ నందనవనం సీతాలక్ష్మి పేదల ఇబ్బందులను గమనిస్తూ సహాయం అందిస్తున్నారన్నారు. గతంలో గుంజి రమణమ్మ అనే మహిళకు ఇల్లు కట్టించి రెడ్‌క్రాస్ అధ్యక్షులు, ఆర్డీవో శీనానాయక్ ద్వారా ఇచ్చారన్నారు. పలువురు దివ్యాంగులకు వాటర్‌బెడ్, మూడు చక్రాల సైకిళ్లు, పేద మహిళలకు కుట్టుమిషన్లు రెడ్‌క్రాస్ ద్వారా అందజేశకరన్నారు. ఆమె స్ఫూర్తితో రెడ్‌క్రాస్ సభ్యులు తమ పరిసరాలలో వుండే బాధితుల్ని గుర్తించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు దాకారపు రవిప్రకాష్, మంగళగిరి వేణుగోపాలరావు, హోమ్‌గార్డు శ్రావణ్‌కుమార్, బి.ఎస్.ప్రసాద్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర పర్యాటక శాఖామంత్రిని కలిసిన అంకినపల్లి



**వింజమూరు, డిసెంబర్22, ప్రభాతవార్త :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో నీలగిరి కొండపై వెలసియున్న మహిమాన్వితమైన శ్రీ గుహమల్లీశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు ఇచ్చిన ప్రతిపాదనలను ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ , వైసిపి సీనియర్ నాయకులు అంకినపల్లి ఓబులురెడ్డి శుక్రవారం ఢిల్లీలోకేంద్ర పర్యాటక శాఖామంత్రి కిషన్ రెడ్డిని కలిసి అందజేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి వచ్చే ఏడాది మార్చిలో నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఓబులురెడ్డి తెలిపారు. జిల్లా పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డిలు , వ్యవసాయ శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి లు ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని ఓబులురెడ్డి పేర్కొన్నారు.

## పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఉదయగిరి బరిలో నిలుస్తా



**వింజమూరు, డిసెంబర్22, ప్రభాతవార్త :** బిజెపి అధిష్ఠానం ఆదేశిస్తే రానున్న 24 ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్ధిగా బరిలో నిలుస్తానని ఎం.ఆర్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త మాదుముల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం సీతారామపురం మండలం బసినేనిపల్లి తన స్వగ్రామమని ఈప్రాంతంలో తమకు టుంబ సభ్యులు, బంధువర్గం , స్నేహితులు, సన్నిహితులు ఎంతో మంది ఉన్నారన్నారు. వ్యాపార రీత్యా బెంగుళూరులో స్థిరపడినప్పటికీ ఈప్రాంత బిడ్డగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందన్నారు. చిన్నప్పటి నుండి ఆర్‌ఎస్‌ఎస్ భావాలు కలిగి ఎబివిపి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడినని దేశం , రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే బిజెపితోనే సాధ్యమన్నారు. ఈ ప్రాంతంలో తమ ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలను చేపట్టానన్నారు. బిజెపి జిల్లా, మండల నాయకులను , కార్యకర్తలను కలిసి తనకు సహకరించాలని కోరుతానన్నారు.

## వివేకానంద పాఠశాలలో గణిత దినోత్సవం



**వింజమూరు, డిసెంబర్22, ప్రభాతవార్త** :వింజమూరులోని శ్రీవివేకానంద పాఠశాలలో శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ మద్దూరు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాసరామాంజనన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గణితంపై ప్రతిభాపరిక్షలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు మనోజ్ మాట్లాడుతూ శ్రీనివాసరామాంజనన్ ఎంతో మేధాశక్తితో ప్రపంచంలోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలిగాడన్నారు. విద్యార్థులు గణితం పట్ల భయం వీడి గణితాన్ని ఇష్టంతో చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవరెడ్డి, నరసారెడ్డి, కృష్ణారెడ్డి, వెంగయ్య, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగనన్న బకాసుర - ప్రభుత్వ స్థలాలు, పంటకాలువ కబ్జా...



**కొడవలూరు డిసెంబర్ 22 ప్రభాతవార్త:** జగనన్న భూసర్వే కింద హక్కుదారుల ఆస్తులు అన్యాక్రాంత మవుతుంటే...జగనన్న బకాసుర సర్వేకింద పంట కాలువలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి అవుతు న్నాయి... అంటూ జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌కుమార్, మరియు జిల్లా ఉపాధ్య క్షులు బద్దిపూడి సుధీర్ పేర్కొన్నారు. కోవరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం, నార్త్‌రాజుపాలెం కాలువ కబ్జాకు గురవుడాన్ని శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ఒకపక్క ప్రజలు భూహక్కులను సందేహంలో పడేస్తూ డ్రోన్లు, వందల సంవత్సరాల కిందట డైక్లాట్లు తీసి హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం అని అన్నారు. అంతేకాక ప్రభుత్వ స్థలాల వియాల్లో వాటిని ఎందుకు ఉపయో గించలేక ఉంది, పంట కాలువలను భౌతికంగా మాయం చేసిన పరిస్థితి ఇక్కడ కనపడుతుంది అని తెలియ జేశారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లే చోద్యం చూస్తున్నారు. ఎమెల్యే ప్రసన్న అంటే మాకు ఎటువంటి కక్షలు ఏమీ లేవు అని తెలిపారు. అందుకే మేము నియోజకవర్గంలో సమస్యలపై పదేపదే ప్రశ్ని స్తున్నాం అని తెలిపారు. మండలంలోని నార్త్‌రాజుపాలం మేయిన్‌రోడ్‌లో ఉండాల్సిన 5అడుగుల పంట కాలువ, రియల్ ఎస్టేట్ హద్దుల్లోకి వెళ్లిపోయింది అని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ విషయాన్నీ ప్రజ లందరూ గమనించి, అవినీతి, దోపిడి వైసిపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, జనసేన కార్యకర్తలు వర్షన్, కేశవ, హేమచంద్ర యా దవ్, కార్తీక్, వరా తదితరులు పాల్గొన్నా

## మేకపాటికి ధన్యవాదాలు తెలిపిన శ్రీనివాసులు



**ఉదయగిరి, డిసెంబర్22, ప్రభాతవార్త** ఉదయగిరి మండలం సోమలరేగడ గ్రామానికి చెందిన జువ్వలదిన్నె శ్రీనివాసులుని వైసీపీ నెల్లూరు జిల్లా ఐటి విభాగ కమిటీలో జిల్లా వైస్ ప్రసిడెంట్‌గా ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి తన పేరు అదిష్టానానికి సిఫార్సు చేయించి నాకు ఈ అవకాశం కల్పించినందుకు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు తెలిపారు. పార్టీ కోసం మరింత అకింత భావంతో పనిచేస్తానని పార్టీ పెద్దల అభిమానాన్ని చోరుగుంటానని తెలిపారు.

## రాజన్న రచ్చబండ కార్యక్రమంలో మేకపాటి



**ఉదయగిరి, డిసెంబర్22, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని లింగమనేనిపల్లి,కొత్తపల్లి గ్రామాల్లో రాజన్న రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో ప్రజా రంజక సంక్షేమ పాలన అందిస్తున్నారని తెలిపారు. ఆయన పాలనలో ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మహిళలు,ఆర్థిక అసమానతలు లేకుండా సంక్షేమ పథకాలను అందుకుని తమ పిల్లలను మంచి భోదన కలిగిన ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ పాఠశాలలో చదివించుకుంటున్నారని తెలిపారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వైద్యం,విద్య,రోడ్లు,వసతి రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని అందుకు ప్రజలందరూ ఆయనను అభినందిస్తున్నారని తెలిపారు. గ్రామంలో గల సమస్యలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అందుకు వారు జగనన్న సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నామని ఆయనకు వివరించారు. ఉదయగిరి మండలకన్వీనర్ గానుగుపెంట ఓబుల్‌రెడ్డి, అక్కుల్‌రెడ్డి, జిల్లాకోఆప్షన్ సభ్యులుగాజుల తాజుద్దీన్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణి చేసిన మేకపాటి



**సీతారామపురం డిసెంబర్ 22 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు వైసిపి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ట్యాబ్‌లు పంపిణి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 51 వ పుట్టినరోజు సందర్భంగా రెండోవ విడత ట్యాబ్‌ల పంపిణి జరుపుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పేద విద్యార్దులకు ట్యాబ్‌ల పంపిణి ఒ గొప్ప కార్యక్రమంగా నిలిచిపోతుందని అన్నారు. రాష్ట్రంలోని పేదరికం సంకెళ్ళను తెంచాలని వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందని పోటీ ప్రపంచంలో పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రపంచంతోపోటి పడాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని సుమారు620 కోట్లరూపాయాలతో బయ్‌జ్యూస్‌పోల్‌లోడెడ్ కంటెంటు గల 4.34లక్షలట్యాబ్‌లను 9వేల 424 పాఠశాలలోని 8 వతరగతి విద్యార్దులకు ఉచితంగా పంపిణి చేయడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంఇఒ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు,నాయకులు పాల్గొన్నారు.

## శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్లో గణితదినోత్సవం



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్లో గణిత దినోత్సవం నిర్వహించారు. మొదటి శ్రీనివాస్ రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దొడ్ల కోదండరామిరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తు విద్యార్థులందరు గణితం పట్ల ఆసక్తి చూపించాలని సూచించారు. గణితం జీవితానికి చాలా అవసరమని అన్నారు. గణిత దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులందరు ప్రత్యేకంగా అంకెల రూపంలో నిలబడి చూపరులను ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమంలో బెస్ట్ అటెండెన్స్ మాక్స్ టాలెంట్ టెస్టు టేబుల్స్ టెస్టు మొదలైనవాటిపై పోటీ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేఖ,ఉమని, గిరిజ, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

## గున్నయ్యను పరామర్శించిన అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త- వైద్యం** ఇటీవల కాలంలో గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగి గున్నయ్యను నెల్లూరు రూరల్ మండలంలోని మాదరాజు గూడూరు గ్రామంలోని ఆయన నివాసంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ శుక్రవారం పరామర్శించారు.అబ్దుల్ అజీజ్ సారంగం గున్నయ్య ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గున్నయ్య త్వరగా కోలుకొని తిరిగి ప్రజా క్షేత్రంలోకి రావాలని అజీజ్ ఆకాంక్షించారు. వారితో పాటు నెల్లూరు రూరల్ మండల అధ్యక్షులు పముజుల ప్రదీప్ అన్నారు.

## గణిత మేధావి రామానుజన్ జీవితం ఆదర్శం



**కోవూరు,డిసెంబరు 22ప్రభాతవార్త :** అంర్జాతీయ స్థాయిలో భారతీయ గణితానికి గుర్తింపు గౌరవాన్ని తెచ్చిన గణిత మేధావి రామానుజన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమనికళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలోశుక్రవారం ప్రముఖ భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 127వ జయంతి వేడుకలు పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాల్యం నుంచే రామానుజన్ తన అసమాన గణిత శాస్త్ర పాండిత్యంతో ప్రపంచ మేధావులను సైతం ఆశ్చర్యచకితులను చేశారన్నారు. రేఖా గణితం, ఆల్‌జీబ్రా, కలనగణితం, గణిత శాస్త్ర శాఖలలో రామానుజన్ విస్తృతమైన పరిశోధనలు చేసి అసంఖ్యాకమైన గణిత సూత్రాలను, సిద్ధాంతాలను ప్రతిపాదించారన్నారు. ఆయన ప్రతిపా దించిన ఆవిష్కరణాత్మక సిద్ధాంతాలు నేటికీ ప్రపంచ వ్యాప్తంగా గణిత శాస్త్రజ్ఞులను ఉత్తేజపరుస్తున్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతీయ యువ గణిత శాస్త్రజ్ఞులకు రామానుజన్ జీవితం ఆదర్శనీయమన్నారు. ఆయన చూపిన బాటలో పయనించి గణిత శాస్త్రంలో ప్రపంచ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు డాక్టర్ కె. సందీప్‌కుమార్. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## కృత్రిమ గర్భధారణపై అవగాహన పెంచాలి



**కోవూరు, డిసెంబరు 22 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల్లో మేలుజాతి పశు సంపదపై మరింత దృష్టి సారించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె. కృష్ణ మౌర్య అన్నారు. కోవూ రులోని శాంతి నగర్‌లో ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సబ్ డివిజన్ పరిధిలోని విడవలూరు, కోవూరు మండలాలకు సంబంధించిన పశు వైద్యులు, పశు సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండ లంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పశు రైతులకు పశు ఆరోగ్య కార్డులు కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. పాడి రైతులు ఆసు పత్రికి వచ్చే సమయంలో తప్పనిసరిగా ఈ కార్డు తీసుకుని వచ్చి పాడి పశువుకు కావాల్సిన సేవలు పొందాల న్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా రైతులకు కేవలం పెయ్యదూడలు మాత్రమే పుట్టే పథకాలు ప్రవేశపె ట్టడం జరిగిందని, ఈ విషయంపై గ్రామాల్లోని పాడి రైతుల్లో అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్క పశువుకు 500 రూపాయలు చెల్లిస్తే 850 రూపాయలను ప్రభుత్వమే సబ్సిడీ చెల్లిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మేలుజాతి పశువులను అభివృద్ధి చేయడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. రైతుభరోసా కేంద్రాలు నిర్వహించేలా పశు విజ్ఞానబడి కార్యక్రమంలో రైతులు తప్పనిసరిగా పాల్గొనే తగు చొరవ తీసుకోవాలన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల ప్రాంగణంలో వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటు చేయడం జరిగిందని, పాడి రైతులు ఈ ప్రయోగశాల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా పశు అంబులెన్స్‌పై పాడి రైతుల్లో అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో దండిగుంట పశు వైద్యాధికారి డాక్టర్ జేవీ చంద్రమోహన్, విడవలూరు పశు వైద్యాధికారి డాక్టర్ పి. వాణి శంకర్, వేగూరు పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే షబానా, లేగుంటపాడు పశు వైద్యాధికారి డాక్టర్ బి. ప్రీతి సాల్మన్, మూడు మండలాలకు సంబంధించిన పశు సహాయకులు పాల్గొన్నారు.

## జిల్లా క్రీడాపోటీల్లో గీతాంజలివిద్యార్థినులు ప్రతిభ



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** మహిళా గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో గీతాంజలి విద్యార్థినులు వి. ప్రణతి, ఎం. స్పందన , డి. శ్రావ్య అత్యంత ప్రతిభ కనబరిచి తమ పాఠశాల పేరును మరింత ఇనుమడింపజేశారని కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో శుక్రవారం విద్యార్థినుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థిని వి. ప్రణతి 800 మీటర్లు, 400 మీటర్లులో మొదటి బహుమతి, 200 మీటర్లలో రెండవ బహుమతి, త్రిబుల్ జంప్‌లో మూడవ బహుమతి సాధించి జిల్లా స్థాయి మహిళా క్రీడా పోటీల్లో వ్యక్తిగత చాంపియన్ షిప్ సాధించారన్నారు. అదేవిధంగా ఎం. స్పందన విద్యార్థిని త్రిబుల్ జంప్‌లో మొదటి బహుమతి, లాంగ్ జంప్‌లో రెండవ బహుమతి సాధించారన్నారు. టేబుల్ టెన్నిస్ విభాగంలో తమ విద్యార్థులు వి. ప్రణతి, డి. శ్రావ్య ప్రథమ బహుమతి సాధించగా షటిల్ బ్యాడ్మింటన్‌లో కూడా వీరిద్దరు ద్వితీయ బహుమతి సాధించారన్నారు. ఈ ముగ్గురు విద్యార్థినులు జనవరి 4,5,6 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్, వై. విజయ్‌శంకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## ఆదర్శ ప్రాయుడు గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్



**దుత్తలూరు,డిసెంబర్ 22,ప్రభాతవార్త :** నేట తరం యువతకు,విద్యార్థులకు గణిత పితామహుడు,శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ ఆదర్శప్రాయుడని విశ్వతేజ విద్యాసంస్థల కరస్పాడెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు.శుక్రవారం స్థానిక విశ్వతేజ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు..ముందుగా రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భంగా గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు విద్యార్థుల కు వివరించారు.అనంతరం విద్యార్థులు రామానుజన్ సంఖ్యగా పిలువబడే 1729 సంఖ్య ఆకృతిలో విద్యార్థులు ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగుంవేసిన మహా గణిత శ్రాస్తవేత్త శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు.ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు హిమ బిందు,శివరామకృష్ణ,నవీన్,నారపురెడ్డి,ఖాజా మహబూబ్,,కిరణ్,బాల నరసింహారెడ్డి,విద్యా ర్ధిని ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఈ క్రాఫ్ తప్పక నమోదు చేయించుకోవాలి



**వరికుంటపాడు,డిసెంబర్ 22,ప్రభాతవార్త :** రబీ సీజన్ లో పంటలను సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పక పంట నమోదు చేయించుకోవాలనీ మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ తెలిపారు.శుక్రవారం మండలంలోని వేంపాడు గ్రామంలో జరుగుతున్న ఈ క్రాఫ్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటను వేసిన వెంటనే వీఏల ద్వారా రైతులు పంటను నమోదు చేయించుకోవాలనీ,అలాచేయించుకున్న వారికి మాత్రమే పంట భీమా,పండిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనుటకు,ప్రకృతి వైపరిత్యాల సమయంలో పంట నష్టం అందించేందుకు అర్హత కలిగి ఉంటారనీ అన్నారు.అలాగే సిసిఆర్‌సి కార్డులు పొంది పంటలు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం కోసం ఆర్‌బికెల లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనీ ఈ అవకాశం ఈ నెల 30 వ తేది వరకు మాత్రమే ప్రభుత్వం కల్పించిందని ,కాబట్టి అర్హులైన వారు ఆర్‌బికెలలో సంప్రదించాలనీ సూచించారు.ఈ సందర్భంగా ఆయన సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి రైతులకు పంటలలో వచ్చే తెగుళ్ళు,పురుగుల పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమములో వేంపాడు అగ్రికల్చర్ అసిస్టెంట్ వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## హరిహరసుతుడి నామ స్మరణలో అయ్యప్పలు



**వరికుంటపాడు,డిసెంబర్ 22,ప్రభాతవార్త :** మండలంలోని గొల్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి పడి పూజ ఎంతో అంగరంగవైభవంగా నిర్వహించారు.గ్రామంలోని అయ్యప్ప మాలధారులు ఎంతో నిష్టగా,41 రోజుల పాటు అయప్ప దీక్షను పూని,అను నిత్యం అయ్యప్ప అయప్ప అంటూ నామస్మరణతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భగవంతుని దీక్ష ను పూర్తి చేసుకొని,శబరిమలకు పయనమయ్యే ముందు ప్రత్యేకంగా స్వామి వారికి పడి పూజను నిర్వహిస్తారు.అందులో భాగంగా అయ్యప్ప స్వామి తో పాటు ,అయప్ప సోదరులు అయిన వినాయకుడు,సుబ్రమణ్య స్వాములను సైతం ప్రత్యేకంగా అలంకరించి,దీప.ధూప నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు నిర్వహించారు.అందులో భాగంగా కలజ పూజ కోసం అయప్ప మాల ధారులు పోటి పడి మరి 70 వేల రూపాయలకు అదే గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారుడు మద్దిపాటి రమేష్ స్వామి దక్కించుకొని ,ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అయ్యప్ప స్వామి విగ్రహానికికి పంచామృత అభిషేకాలు,వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు. అనంతరం శబరిమల లో ఉన్న పద్దెనిమిది మెట్లపై పూజలు చేసి,కర్పూరంతో దీపాలను మాలధారులు వెలిగించారు.స్వామివారికి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పడి ఎంతో ఆకట్టుకుంది.అనంతరం శుక్రవారం నాడు ఇరుముడి లను కట్టుకొని శబరిమల యాత్రకు అయ్యప్ప మాలధారులు పయనమయ్యారు.ఈ పూజా కార్యక్రమాలను పామూరు అయ్యప్ప స్వామి ఆలయ పూజారి కార్తిక్ స్వామి నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్పలు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయప్ప స్వాములు తరలివచ్చారు.

## ఆడుదాం ఆంధ్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ఈ నెల 26వ తేది నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. ఈ మేరకు స్థానిక పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 16 సచివాలయాలకు సంబంధించి 160 మెన్ టీమ్‌లు, 160 ఉమెన్ టీమ్‌లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయడం జరిగిందన్నారు. మొత్తం మండలంలో 9 మైదానాలను ఎఇపంక చేయడం జరిగిందన్నారు. ప్రతి మైదానానికి గ్రౌండ్ ఇన్‌చార్జిగా మండలస్థాయి అధికారులను నియమించడం జరిగిందని, స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణయ్య, పీఈటీ వెంకటసుబ్బమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, తదితరులు ఉన్నారు.

## సమ్మె ఆపాలనే ఆలోచన ప్రభుత్వంలో లేదు



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** తమ న్యాయమైన కోర్కెలు కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు శాంతియుతంగా చేపడుతున్న దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా దయాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ కోర్కెలు పరిష్కారం కోసం చేస్తున్న పెరాటాన్ని కించపరిచే విధంగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడడం బాధాకరమన్నారు. ఇటువంటి వారి మాటలు కొత్త ఏమీ కాదని, అధికారంలో ఉన్నామనే అహంకారంతో వీరు విర్రవీగుతున్నారని, ప్రజలే బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. 11 రోజులుగా సమ్మె జరగడం చరిత్రలోనే ముఖ్యమంత్రి నిలిచిపోయారన్నారు. కుట్రలతో వీరి దీక్షలను అణచివేయాలని ప్రభుత్వం రకరకాల ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఇన్ని రోజులుగా శాంతియుతంగా మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు అన్నపూర్ణమ్మ, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, నాయకులు శేషమ్మ, విజయమ్మ, అరుణ, సీఐటీయూ నేతలు శేషయ్య, అఫ్రోజ్, సుబ్బారావులు పలు సూచనలు చేశారు.

## ఎంపిల సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా నిరసన



**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలులో శుక్రవారం పార్లమెంటులో బిజెపి ప్రభుత్వం ఇండియా కూటమి ఎంపిలను సస్పెన్షన్‌కు చేసినందుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి ఎల్.సురేష్‌బాబు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్.కె.జహీర్, జిల్లా కార్యదర్శి అంతోనిరాజ్, లాలం వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సిపియం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, సిఐటియు మండల కార్యదర్శి నరహరిలు మాట్లాడారు. పార్లమెంటుపై దాడి జరిగితే దాడికి పాల్పడిన వారికి పాసు ఇచ్చిన ఎంపిని శిక్షించాలని, దీనికి ప్రధానమంత్రి,హోం శాఖ మంత్రి జవాబు చెప్పాలని డిమాండ్ చేస్తే 146 ఎంపిలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని ఆరోపించారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించిన బిజెపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని త్వరలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రజలు స్పష్టమైన తీర్పును ఇవ్వబోతున్నారన్నారు.

## జగనన్న ప్రభుత్వంలో విద్యారంగానికి పెద్దపీట



**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో విద్యారంగానికి పెద్దపీట వేయడం జరిగిందని విశ్వనాథరావుపేట గ్రామ సర్పంచ్ గందూరు మంజుల పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ ప్లస్ 2 బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు ఉచిత బైజూస్ ట్యాబుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తనల చేతుల మీదుగా ట్యాబులు అందచేసి మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ విద్యను అందించాలనే ఉద్దేశంతో ఆధునిక, సాంకేతికతో కూడుకున్న డిజిటల్ విద్యను అందించేందుకు ట్యాబులు అందజేయడం జరిగిందన్నారు. ఈ ట్యాబుల ద్వారా మరింత సాంకేతికతో అదనంగా విజ్ఞానాన్ని పొందేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఎ.కె.సుందర్‌రాజ్, ఎంఇవోలు నరసింహరావు, జయమ్మ, బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ టు ప్రిన్సిపాల్ గంగాధర్, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్‌ఠాగూర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి కృషి చేస్తాం



**బిట్రగుంట, డిసెంబరు 22 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలోని బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని స్వర్గీయ అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీలు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు పేర్కొన్నారు. బోగోలులోని దళితవాడలో వున్న బ్రహ్మంగారి మఠాన్ని స్థానిక పెద్దల కోరిక మేరకు శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం కృష్ణకుమార్ దంపతులను మాజీ ఎంపిపి పర్రి సులోచనమ్మ, మాజీ సర్పంచ్ పర్రి అంకులయ్యలు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సాయి సేవకులు డాక్టర్ ఆనందసాగర్, గోపిశెట్టి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి పోటీల్లో ఐఎంఎస్ విద్యార్థులకు ద్వితీయ స్థానం



**కావలి రూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త** కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కావలి పట్టణ, కావలి మండల స్థాయి చెకుముకి టాలెంట్ పోటీలలో కావలి ఐఎంఎస్ విద్యార్థులు తమ ప్రతిభను చూపి ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు. జనవిజ్ఞాన వేదిక కావలి పట్టణ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, కార్యదర్శి హరనాథ్‌లు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## మేకపాటి గెలుపులో అందరం భాగస్వామ్యులవుతాం

**దుత్తలూరు,డిసెంబర్ 22,ప్రభాతవార్త :** గతంలో ఎన్నడు లేని విధంగా దుత్తలూరు మండలంలో అన్ని వర్గాలకు నేతలకు,అన్ని గ్రామాల్లో పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు కూడా గుర్తింపు నిస్తూ ,ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రతి కార్యకర్త ఎదుగుదలే ముఖ్యంగా జిల్లా కమీటిల్లో 22 మంది కి వివిధ స్థాయిల్లో స్థానం కల్పించారనీ మండల పార్టీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి తెలిపారు.గతంలో మండలంలో ఒకరిద్దరికి తప్ప ఎవ్వరికి పదవులు ఇచ్చిన దాఖలు లేవనీ కాని నేడు తమ నాయకుడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గంలో ఉన్న 8 మండలాల్లో కల్లా ఎక్కువ పదవులను తమ నేతలు,కార్యకర్తలుకు ఇప్పించి,కార్యకర్తల కష్టాన్ని గుర్తించారనీ అందుకు తాము మేకపాటి కి కృతజ్ఞతలు తెలిపారు.మండలంలో పదవుల పొందిన వారు జువ్వలదిన్నె శ్రీనివాసులు(ఐటి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు),మల్లవరపు వినోద్‌రెడ్డి (ఐటి విభాగం,ప్రధాన కార్యదర్శి),వాణీజ్యం విభాగం ఉపాధ్యక్షుడుగా లెక్కల పెద్ద మాలకొండారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా నంబూరు రోశిరెడ్డి,మహిళ విభాగం ప్రధాన కార్యదర్శిగా తాతపూడి బేబి సురేఖ,సెక్రటరీ గా పాలగిరి సుష్మ,ప్రచారకమీటి లో అడుసుమల్లి శ్రీహరి నాయుడు (జిల్లా కార్యదర్శి),రామిరెడ్డి కొండారెడ్డి (జాయింట్ సెక్రటరి),రైతు విభాగంలో వల్లూరు వెంకట్‌రెడ్డి( ప్రధాన కార్యదర్శి),ఎస్సీ సెల్ లో కొండా శ్రీనివాసులు(కార్యదర్శి),విద్యార్ధి విభాగం లో శివుని హర్షవర్ధన్‌రెడ్డి(ప్రధాన కార్యదర్శి),లెక్కల నరసింహారెడ్డి(జాయింట్ సెక్రటరి),యువజన విభాగం ఉప్పలపాటి వెంకట్రామిరెడ్డి (సెక్రటరి),సేవాధళ్ లో చుండి వెంకటరెడ్డి (ప్రధాన కార్యదర్శి),ట్రేడ్ యూనియన్ లో ఎన్.రంగయ్య (ప్రధాన కార్యదర్శి),వైద్యవిభాగం వై.శ్రీనివాసులు (సెక్రటరి),వికలాంగుల విభాగం లో శిముని వెంగళ్ రెడ్డి (ప్రధాన కార్యదర్శి),మైనారిటి సెల్ లో ఖాజా మస్తాన్ (జాయింట్ సెక్రటరి),కల్చరల్ విభాగం లో చల్లా రత్తయ్య (సెక్రటరి),దాసరి కృష్ణయ్య (జాయింట్ సెక్రటరి),బీసి సెల్ లో గంగవరపు రమణయ్య (సెక్రటరి),చేనేత విభాగం లో బండి శ్రీనివాసులు (జాయింట్ సెక్రటరి )లుగా పదవులు పొందారు.ఈ పదవులు పొందడానికి కృషి చేసిన ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి కి,ఆయన తనయుడు మేకపాటి అభినయ్ రెడ్డి లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.మండలంలో ఇంత మందికి ఒకే సారి పదవులు సాధించడంలో మండల పార్టీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి,పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొంతిరెడ్డి జయసింహారెడ్డి లు తన పాత్ర వహించి,సామాన్య కార్యకర్తలకు పదవులు ఇప్పించారు.అందరం కలిసి కట్టుగా పని చేసి రానున్న ఎన్నికల్లో మండలంలో మేకపాటి రాజగోపాల్ రెడ్డికి అత్యధిక మెజారిటి సాధించి,గెలుపు కోసం శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు.మండలంలో అన్ని వర్గాల వారికి పదవులు రావడం అందరూ ఎకతాటిపైకి రావడంతో ప్రతిపక్ష పార్టీలో అలజడి నెలకొంది.

## టాలెంట్ టెస్ట్‌లో ప్రధమ స్థానంలో నిలిచిన సర్వాయపాలెం విద్యార్థులు



**కావలి రూరల్, డిసెంబరు 22 ప్రభాతవార్త** కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కావలి పట్టణ, మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలలో కావలి రూరల్ మండలం సర్వాయపాళెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని, విద్యార్థులు ప్రధమ స్థానంలో నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణ శుక్రవారం విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్ధి పోటీ పరీక్షల్లో పాల్గొని మంచి ప్రతిభ పొందడమే కాకుండా శాస్త్రీయ అవగాహన పెంపొందించుకొని సమాజంలోని మూఢ నమ్మకాలను పారదోలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే భావితరాలకు బంగారు బాట



**నెల్లూరు, డిసెంబర్ 22, ప్రభాతవార్త- వైద్యం** తెలుగుదేశం పార్టీతోనే భావితరాల భవిష్యత్తుకు బంగారు బాట సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 17వ రోజు 37వ డివిజన్, సరస్వతి నగర్ నుండి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక్కడే ఒంటరిగా లక్ష మందితో మాటామంతి మొదలు పెట్టారు. భవిష్యత్తు తరాలకు మంచి రోజులు రావాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని ప్రజలను ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి, తాను తెలుగుదేశం పార్టీ నుండి పోటీ చేస్తున్నాని, సైకిల్ గుర్తుపై ఓటు వేసి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని ప్రజలను ఆయన కోరారు.

## దేశభక్తిని మరింత పెంపొందించుకోవాలి



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త** : ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులు దేశభక్తిని మరింత పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందని లెఫ్టినెంట్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్ అన్నారు. కోవూరు మండలం నేతాజీనగర్‌లోని వైకేఆర్అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పది ఆంధ్ర నేషనల్ యూనిట్ ఎన్‌సీసీ రైజింగ్ డే, ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన విద్యార్థులకు అనేక ఉపయోగాలు కూడా ఉన్నాయన్నారు. క్రమశిక్షణతో పాటు ఒక ఉత్తేజం కూడా ప్రతి ఒక్కరిలో కలుగుతుందన్నారు. అదేవిధంగా రిపబ్లిక్‌డే పరేడ్, సైనిక్ క్యాంపుల వంటి కార్యక్రమాల్లో పాల్గొని వారి దేశభక్తిని మరింత పెంపొందించుకోవచ్చని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్‌సీసీ రైజింగ్ డే ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకరించిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డికి, లెఫ్టినెంట్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామచంద్రన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఎన్‌సీసీ వలన విద్యార్థులుపూర్తిస్థాయిలో అభివృద్ధిలోకి వస్తారని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామ్‌ప్రసాద్, ఎన్‌సీసీ కేర్ టేకర్ పి. సురేంద్రలు పలు సూచనలు చేశారు. అనంతరం వినయ్ రామచంద్రన్‌ను శాలువా, బొకేతో సత్కరించారు.

## అంగన్‌వాడీలకు జనసేన మద్దతు



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త :** తమ న్యాయమైన కోర్కెలు కోసం గత 11 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్నా ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గునుకుల కిషోర్, ఉపాధ్యక్షుడు బి. సుధీర్‌లు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన దీక్షకు శుక్రవారం వీరు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కల్లబొల్లి మాటలు చెప్పి పక్క రాష్ట్రాల కంటే వెయ్యి రూపాయలు ఎక్కువగా ఇస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ఈ ఊసే పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన దీక్షలను విరమింపజేసి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. కనీస వేతనాన్ని అమలులోకి తీసుకురావడమే కాకుండా గ్రాడ్యుటీ విషయంలో కూడా ప్రభుత్వం న్యాయంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు ప్రశాంత్ గౌడ్, వర్షన్, హేమచంద్ర యాదవ్, కేశవ్, కార్తీక్, తదితరులు ఉన్నారు.

## వైఎస్ఆర్ మానస పుత్రిక ఆరోగ్య శ్రీ ఎమ్మెల్యే



**బుచ్చి డిసెంబర్ 22 ప్రభాతవార్త** వైఎస్ఆర్ మానసపుత్రిక ఆరోగ్య శ్రీ అని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశంసించారు.బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతు 5 లక్షలు ఆదాయం ఉన్న ప్రతి పేదవారికి 25 లక్షల రూపాయాలు వరకు వైద్యం అందించే విదంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన అన్నారు. భారతదేశంలో ఏముఖ్యమంత్రి ఇంత మంచికార్యక్రమం చేయలేదని ఆయన కొనియాడారు. కార్పోరేటుహాస్పటల్స్ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయని,దీనికి సంబందించి చిరంజీవి ఠాగూరు సినిమా కూడా తీశారని అన్నారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు.ఆరోగ్యశ్రీ అద్భుతమైన కార్యక్రమం అని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ కార్డ్సు పంపిణి చేశారు. అలాగే దాణాను కూడా అందజేశారు. మరో మూడు నెలలో ఎన్నికల రానున్నాయి ప్రజలందరు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ,జనసేన పార్టీ వారు డబ్బులు ఇస్తే తీసుకొని ప్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. 2 లక్షల 25 వేల కోట్లు ప్రజలందరికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అకౌంట్లలో వేశారని అన్నారు.ఒక్కసారి ఆలోచించి ప్రజలు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలోకోవూరు నియోజకవర్గం యువజన విభాగం అద్యక్షులు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, డిఎల్‌డిఎ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు , ఎంపిడిఓ నరసింహరావు, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, సచివాలయాలకన్వీనర్ మోర్ల మురళీ, వైస్‌చైర్‌పర్సన్ కోటంరెడ్డిలలితారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ షాహుల్,కౌన్సిలర్లు కంటా అనంతమ్మ,చీర్ల ప్రసాద్‌యాదవ్,బిట్రగుంట ప్రమీలమ్మ, యరటపల్లి శివకుమార్‌రెడ్డి బెల్లం మల్లారెడ్డి, పుట్టా లక్ష్మీకాంతమ్మ, మోర్ల జయంతి, రాచూరుసత్యనారాయణ,కోడూరు మధుసూదన్‌రెడ్డి,ఇన్నమూరి నరసింహరావు,జొన్నవాడ దేవస్దానం ట్రస్టు బోర్డు మెంబర్ గుంటూరు కామేశ్వరమ్మ, గుంటూరు వెంకటేశ్వర్లు, మోర్ల భరత్‌కుమార్, బట్టా విల్సన్,బట్టా ప్రవల్లిక,జొన్నవాడ నాయకులు బాలకృష్ణా, మురళీ,సాగర్,పెనుబల్లి నాయకులు పెంచలయ్య, కోవూరు మార్కెటింగ్ డైరక్టర్ జొన్నవాడ ప్రసాద్ ,చింతం చలపతి,డాక్టర్లు,సచివాలయం సిబ్బంది,సెక్రటరీ నారాయణరావు వైసిపినాయకులు పాల్గొన్నారు.

## డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి



**కోవూరు, డిసెంబరు 22ప్రభాతవార్త** : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారికి ఉపయోగపడే విధంగా డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తూ విద్యార్థులను గ్లోబల్ సిటిజన్‌లుగా తీర్చిదిద్దుతున్న ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి కొనియాడారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం 168 మంది 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 62 వేల ఇంటారాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను 45 వేల స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ప్రభుత్వ పాఠశాలల మీద దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటుగా ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారాలనే ఉద్దేశంతో నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారన్నారు. అయితే 2 చానెల్స్ మాత్రం ఈ ట్యాబ్‌ల వల్ల విద్యార్థులు నీలిచిత్రాలు చూసి చెడిపోతున్నారని చెప్పడం దారుణమన్నారు. వారి వారి పిల్లలు మాత్రం ఇంగ్లీష్ మీడియంలో చదవచ్చు.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రం ఇంగ్లీష్ మీడియాం , ట్యాబ్‌లను వాడకూడదని చెప్పడం జరిగిందన్నారు. ఎక్కడ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారుల హృదయాల్లో నిలిచిపోతారనే ఇటువంటి పిచ్చ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నతస్థాయికి రావాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంత ప్రధాన్యత ఇస్తుందో ప్రభుత్వ బడ్జెట్ చూస్తేనే తెలుస్తుందన్నారు. విద్యాకానుక ద్వారా నాణ్యమైన విద్యా వస్తువులు పంపిణీ చేయడమే కాకుండా జగనన్న గోరుముద్ద ద్వారా బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సుధాకర్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి మండల విద్యాశాఖ అదికారి రహీమ్, పలు సూచనలు చేశారు. అనంతరం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి,డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి,జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ సుబ్బారెడ్డి, రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్,జిల్లా వైసీపీ యువజన విభాగం కార్యదర్శి సాయియశ్వంత్‌రెడ్డి. జగదీష్, , ఉపసర్పంచ్ అహ్మద్, వైసీపీ నేతలు కె. మల్లికార్జున్, ఎం. చిరంజీవి, జబేర్ బాషా, శివకుమార్‌రెడ్డి, ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ,, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ , ఉన్నారు.

## రైతు పడని కష్టంలేదు- రైతు చూడని నష్టం లేదు




**వింజమూరు ,డిసెంబర్22,ప్రభాతవార్త :** సమాజంలో రైతు పడని కష్టం లేదు - రైతు చూడని నష్టం లేదని అలాంటి రైతును ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్‌బిఐ రీజనల్ క్రెడిట్ చీఫ్ మేనేజర్ డి.శరత్‌బాబు , ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు ఎస్‌బిఐ కార్యాలయంలో జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతు దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారత 5వ ప్రధాని చరణ్‌సింగ్ జన్మదినాన్ని జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. చరణ్‌సింగ్ భారతదేశపు రైతుల విజేతగా నిలిచాడన్నారు. అనేక ఉద్యమాల వలన జమీందారీ చట్టం రద్దయి కౌలుదారు చట్టం అమలులోకి వచ్చిందన్నారు. రైతులకు బ్యాంక్ రుణాలు అందించేలా చరణ్‌సింగ్ హయాంలోనే ప్రవేశపెట్టారన్నారు. ఆనాడే రైతుల గురించి , వ్యవసాయ రంగం గురించి వారి సమస్య పరిష్కారానికి కృషిచేసిన వ్యక్తి మాజీ ప్రధాని చరణ్‌సింగ్ అన్నారు. రైతే దేశానికి వెన్నెముకని రైతులేనిదే మనిలేడన్నారు. రైతు అహర్నిశలు కష్టపడితే తప్ప మనం తినే అన్నం కంచంలోకి రాదన్నారు. అతివృష్టి, అనావృష్టి అనునిత్యం రైతును వెంటాడుతూనే ఉన్నా రైతు మాత్రం తన కష్టాన్ని వీడడన్నారు. రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంట కందుతుందనే నమ్మకం లేకపోయినా సరే ఏనాడు కృంగిపోకుండా ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాది ప్రకృతి కరుణించకపోతుందా అని జీవనం సాగిస్తాడన్నారు. అలాంటి రైతులను తాము గౌరవించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎస్‌బిఐ అందిస్తున్న అనేక పథకాలపై అవగాహన కలిగి రుణాలను పొందాలన్నారు. ఈ ప్రాంతంలో రైస్‌మిల్లుల ఏర్పాటుకు బ్యాంక్ రుణాలను అందిస్తుందన్నారు. బ్యాంక్ రుణాలతో వారి జీవనోపాదిని మెరుగుపరచుకోవాలన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి కావాల్సిన రుణాన్ని అందిస్తామన్నారు. తమ బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన వారు సకాలంలో చెల్లిస్తూ బ్యాంక్ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పంట రుణాలే కాక దీర్ఘకాలిక, అగ్నిముద్ర రుణాలు తదితర రుణాలను బ్యాంక్ ద్వారా ఇస్తారన్నారు. అనంతరం రైతులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమోహన్, విశ్రాంత నగదు అధికారి కోటేశ్వరరావ్ , ఎఫ్ఓఎస్ జ్యోతి బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

## ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కత్తుల దాడి !



**కావలి, డిసెంబరు 22 ప్రభాతవార్త** ముసునూరు ఆటోనగర్‌లో శుక్రవారం జరిగిన కత్తుల దాడి ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జరిగిందే తప్ప ఏ పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రశాంతంగా వున్న కావలిలో ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ముసునూరు ఆటోనగర్‌లో కత్తుల దాడిలో ఒకరు మృతి చెందారని, నలుగురు గాయాలపాలయ్యారని సమాచారం అందిన వెంటనే గడపగడప కార్యక్రమం నుంచి ఏరియా వైద్యశాలకు హుటాహుటిన తరలిరావడం జరిగిందన్నారు. మృతి చెందిన వ్యక్తి సూరిశెట్టి సురేష్ మృతదేహాన్ని సందర్శించడం జరిగిందన్నారు. మృతుడి భార్య వాణిని ఓదార్చి దాడి సంఘటన వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. బాధితులకు అండగా వుంటామన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇది రాజకీయాలకు సంబంధించిన దాడి కాదన్నారు. కేవలం ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన దాడి అని తెలిపారు. కావలి 34వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్ పుల్లా శ్రీనివాసులరెడ్డి సోదరుడు సుబ్బారెడ్డి పలువురు దగ్గర అప్పులు చేసి ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు వున్నాయన్నారు. బాధితులు తనను కూడా సంప్రదించారన్నారు. తాను డిఎస్పీతో మాట్లాడి అప్పులు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని కోరడం కూడా జరిగిందన్నారు. అయితే వైసిపి నేత శ్రీనివాసులరెడ్డికి, ఆయన సోదరుడు సుబ్బారెడ్డిల మధ్య ఎటువంటి సంబంధాలు లేవన్నారు. మృతుడు సూరిశెట్టి సురేష్ కూడా తనను సంప్రదించి న్యాయం చేయాలని కోరడం జరిగిందన్నారు. అయితే ఈలోగా ఈ సంఘటన జరగడం తనను ఎంతగానో కలిచివేసిందన్నారు. వైద్యుల్ని అప్రమత్తం చేసి కత్తి దాడిలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించామన్నారు. గాయపడ్డ వారికి ఆర్థిక సహాయ సహకారాలు అందించి ఆదుకుంటానన్నారు. ఈ కత్తుల దాడిలో ఎవరెవరు వున్నారో వారందరిని కఠినంగా శిక్షించాలని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. ఈ సంఘటనపై టిడిపి నాయకులతో మాట్లాడగా ఇది ఆర్థిక లావాదేవీలకు సంబంధించిందేనని చెప్పడం కూడా జరిగిందన్నారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు పాల్గొన్నారు. నెల్లూరులో చికిత్స పొందుతున్న వారిని కూడా ఎమ్మెల్యే నెల్లూరుకు వెళ్లి పరామర్శించారు. అండగా వుంటానని హామీ ఇచ్చారు. కావలిలో రౌడీమూకలను ఏరిపారేస్తామని హెచ్చరికలు చేశారు. హంతకుల్ని వదిలిపెట్టే ప్రశక్తే లేదన్నారు. కావలిలో రౌడీయిజంపై ఉక్కుపాదం మోపి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపడతానని హెచ్చరికలు చేశారు.

## కృష్ణచైతన్య "టెక్నోఫెస్ట్ విజ్ఞాన-2కె24" వాల్‌పోస్టర్స్ ఆవిష్కరణ



**నెల్లూరు,డిసెంబరు22 ప్రభాతవార్త-విద్య** 2024 జనవరి 6వ తేదీన కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్‌టెక్నాలజీ కళాశాలలో నిర్వహించతలపెట్టిన జాతీయస్థాయి "టెక్నోఫెస్ట్ విజ్ఞాన-2కె24 వాల్‌పోస్టర్స్‌ను శుక్రవారం నగరంలోని స్థానిక కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ ఆర్‌వి.కృష్ణారెడ్డి, పర్వతరెడ్డి రానా ప్రమోద్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తమ కళాశాలకు చెందిన డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఎంసిఏ,ఎంబిఏ విద్యార్థులు కాకుటూరులోని తమ పిజీ కళాశాలలో ఒక్కరోజు జాతీయస్థాయి టెక్నికల్ సిపోయిజం విజ్ఞాన్-2కె24 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు,చిత్తూరు, ఒంగోలు జిల్లాల్లో డిగ్రీ,ఇంజనీరింగ్, పిజీ చదివిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పాల్గొన్న విధ్యార్దులకు క్విజ్‌తోపాటూ వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని, ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి ప్రధమ బహుమతిగా రూ.5116,ద్వితీయ బహుమతిగా రూ.3116, తృతీయ బహుమతిగా రూ.1116 నగదును అందంజేయనున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనటం వలన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, విజ్ఞానం బహిర్గతం అవుతుందని, విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకుని వారి వారి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కళాశాల డీన్స్ డాక్టర్ యు.మల్లిఖార్జునయ్య, టి.జ్యోతి, ప్రిన్సిపాల్ ఎం.ప్రసాద్, ఎంసిఏ హెచ్ఓడి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



**పొదలకూరు డిసెంబర్ 22 ప్రభావార్త** ప్రతి ఒక్కరు కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ప్రాథమిక దశలో దానిని గుర్తిస్తే కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నేర్మించ వచ్చునని పొదలకూరు సెక్టార్ డిప్యూటి పారా మెడికల్ ఆఫీసర్ మోహన్‌రావు అన్నారు.శుక్రవారం స్దానిక విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో విద్యార్దులకు కుష్టు వ్యాధి ,హెచ్ఐవి, వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. ఈనెల 27 వ తేది నుండి జనవరి 12 వతేది వరకు కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మణి చందన, ఎఎన్ఎం హైమావతి, ఆశాకార్యకర్త ప్రభావతి, విజ్ఞాన కాలేజి ప్రిన్సిపల్ సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జర్లు చల్లా వెంకటకృష్ణా, తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా నగరంలో డ్రెస్‌సర్కిల్ షాపింగ్‌మాల్ ప్రారంభం

### -హల్లో నెల్లూరు... అందరూ ఎలా ఉన్నారు

### -మాల్ ప్రారంభోత్సవంలో సందడి చేసిన సినీతార కృతిషెట్టి





**నెల్లూరు,డిసెంబరు22 ప్రభాతవార్త-విద్య** ప్రముఖ వస్త్ర వ్యాపర సంస్థ డ్రెస్‌షాపింగ్ మాల్ నూతనశాఖ శుక్రవారం నగరంలోని స్థానిక నర్తకీ సెంటర్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ ప్రారంబోత్సవ వేడుకల్లో ప్రముఖ సినీతార కృతిశెట్టి ముఖ్యఅతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వల గావించి, రిబ్బన్‌కట్‌చేసి మాల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు నెల్లూరీయుల ఆదరణ అమోఘమన్నారు. తనను షాపింగ్ మాల్ ప్రారంబోత్సవానికి ఆహ్వానించిన డ్రెస్ షాపింగ్‌మాల్ అధినేతలు గోపాల్‌రెడ్డి, హరీష్‌రెడ్డి,లకు ధన్యవాదాలు తెలిపారు. వస్త్ర ప్రపంచంలో 30 సంవత్సరాల అనుభవంతో మెట్రోనగరాల్లో ప్రజలకు సేవలు అందించిన డ్రెస్‌సర్కిల్ నగరంలో నూతన శాఖను ప్రారంబించటం అభినందనీయమన్నారు. కుటంబంలోని అందరికి అన్ని రకాల సందర్భాలకు ఒకే చోట అత్యల్ప ధరలకు మేలైన మోడల్స్ ఇక్కడ లభిస్తున్నాయని పేర్కొన్నారు. నగరవాసులు నూతన మాల్‌ను ఆదరించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతు నగరంలో మెట్రో నగరాల స్థాయిలో షాపింగ్‌మాల్స్ రావటం గర్వకారణమన్నారు. యావత్‌కుటంబం మెత్తం ఒకేసారి అన్నిన రకాల వెరైటీనలు కొనుగోలు చేసే విధంగా మాల్ నిర్మించటం అభినందనీయమన్నారు. అనంతరం షాపింగ్‌మాల్ అధినేతలు గోపాల్‌రెడ్డి, హరీష్‌రెడ్డిలు మాట్లాడుతు వస్త్రరంగంలో తమకు 30 సంవత్సరాల అనుభవం ఉందన్నారు. ఇప్పటికే కర్నూలు,కడప,అనంతపురం, బళ్లారి,బెంగుళ్లూరుల్లో విశేష అనుభవం గడించి నగరంలోని నర్తకి సెంటర్‌లో 40000వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోఅద్భుతమైన సొగసులతో నూతన షోరూమ్‌ను ప్రారంభించటం జరిగిందన్నారు. మెత్తం కుటంబం కోసం అత్యుత్తమ, అతంర్జాతీయ ఫ్యాషన్స్ ,అరుదైన డిజైన్స్ తమ వద్ద లభిస్తున్నాయన్నారు. పట్టు,ఫ్యాన్సీ,హైఫ్యాన్సీ శారీస్,డ్రస్‌మెటీరియల్స్, చుడిదార్స్, రెడిమేడ్స్,లెహంగా, లేడీస్‌వేర్స్, వెస్ట్రన్స్,పార్టీవేర్, కుర్తీస్,ఉమెన్స్‌వేర్,ఎతినిక్‌వేర్,సూటింగ్స్, షర్టింగ్స్, కిడ్స్‌వేర్అన్నీ రకాల వస్త్రలు అత్యల్ప ధరల్లో లబిస్తాయన్నారు. ఉన్నతమైన వస్త్రాల కోనుగోలుకు తమ సంస్థ నమ్మకమైన మాల్‌అని జిల్లా వాసులు తమను ఆదరించాలన్నారు. మాల్ ప్రారంబోత్సవం సందర్బంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ సాంప్రదాయబద్దమైన సంగీత వాయిద్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు డిఎస్పి కోటారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**హలో... నెల్లూరు అందరూ ఎలా ఉన్నారు :** నగరంలోని నర్తకి సెంటర్‌లో శుక్రవారం డ్రెస్‌సర్కిల్‌షాపింగ్‌మాల్ ప్రారంబోత్సవానికి ముఖ్యఅతిధిగా కృతిశెట్టి విచ్చేసి ప్రారంభించారు. దీంతోయువత పెద్ద సంఖ్యలో మాల్‌వద్దకు చేరుకున్నారు. యువతను ఉద్దేశించి మాట్లాడారు. నెల్లూరీయుల ఆదరణ ఆమోగమని, ఇంతటి ఆరదణను తన జీవితంలో మరువలేనన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉత్తమ చిత్రాల్లో నటించి ప్రేక్షలను రంజింప చేస్తామని తెలిపారు. కాగా సినీమాల్లోని తార ఒక్కసారిగా కళ్లముందుకు రావటంతో యువత ఆమెను చూసేందుకు బారులు తీరారు. ఈలలు,అరుపులతో ఆ ప్రాంతం సందడిగా మారింది.